క్లుప్తంగా

ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు



సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, పర్వతగిరి, దుగ్గొండి, రాయపర్తి, నెక్కొండ, ఖానాపురం, తదితర మండలాల్లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు శుక్రవారం వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అర్చకులు తెల్లవారు జామున 5.30 గంటలకు ఉత్తర ద్వార దర్శనం , గరుడ వాహన సేవ నిర్వహించారు. నర్సంపేటలోని ఆలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, ఏసీపీ కిరణ్‌కుమార్, ఆర్డీఓ ఉమారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని కిషన్, తదితర ప్రముఖులు పూజలు నిర్వహించారు.

పెంటకుప్ప తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్‌లో రోడ్డు పక్కనే పోసిన పశువుల పెంట, చెత్తాచెదారాన్ని పంచాయతీ కార్యదర్శి నిట్టు శుక్రవారం తొలగింపజేసి శుభ్రం చేయించారు. గ్రామంలోని పత్తినాయక్ తండాకు వెళ్లే రోడ్డు పక్కనే పశువుల పెంట, చెత్తాచెదారం వేస్తుండటంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటుండడాన్ని 'అటెన్షన్ ప్లీజ్' శీర్షికలో 'సాక్షి' శుక్రవారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. సంబంధిత రైతుతో మాట్లాడి పెంట, చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. మళ్లీ రోడ్డుపై పెంట, చెత్తాచెదారం పోస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బోనస్ ఎగవేతకు కుట్ర

నర్సంపేట : రైతులకు బోనస్ ఎగవేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీలో మోసం చేశారని, రైతు భరోసా ఎగవేశారని, బోనస్ బోగస్‌గా మారిందని ధ్వజమెత్తారు. అన్ని పంటలకు బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చి కేవలం సన్న రకాలకు మాత్రమే చెల్లిస్తామని ప్రకటించి నెల రోజులు గడిచినా రైతులకు ఇప్పటివరకు బోనస్ అందలేదన్నారు. రైతుల నుంచి వర్షాకాలం పంటలను కొనుగోలు చేసి బోనస్ చెల్లించకుండా మోసం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తోందని చెప్పారు.

దుప్పట్ల పంపిణీ

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని దాసరిపల్లికి చెందిన పేదలకు డీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ దాసరి రాజారెడ్డి సమకూర్చిన దుప్పట్లను పేదలకు నర్సంపేట రూరల్ ఎస్సై గూడ అరుణ్ శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. చలి తీవ్రత నేపథ్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలి

నర్సంపేట : పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహించనున్న ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలని గోక లీలావతి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, సెక్రటరీ గోక వినోద్‌బాబు కోరారు. ట్రస్ట్ అధ్యక్షుడు రామస్వామి పర్యవేక్షణలో ఈనెల 12న మల్లంపల్లి రోడ్డులోని మినీ స్టేడియంలో జబర్దస్త్ ఫేమ్ వర్ష స్పెషల్ అట్రాక్షన్‌గా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వివరించారు. ఆసక్తి కలిగిన మహిళలు సెల్ నంబర్ 98497 48488లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

దోమల నివారణకు సాయం

గీసుకొండ : మండలంలోని మనుగొండలో నెలకొన్న దోమల నివారణ, పారిశుధ్య సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి శుక్రవారం రూ.5 వేల నగదు సాయం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి షకీల్ అహ్మద్, కారోబార్ గూబ అరుణ సమస్యలను వివరించగా ఆయన స్పందించారు.

ఇద్దరికి గాయాలు

చెన్నారావుపేట : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని ఉప్పరపల్లి–చెన్నారావుపేట ప్రధాన రహదారిలోని ఈర్యతండా సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. కోనాపురం శివారు కాల్‌నాయక్‌తండాకు చెందిన వసంత, ఉప్పరపల్లికి చెందిన మాడిశెట్టి నవీన్ వారి ద్విచక్ర వాహనాలపై వస్తుండగా ఒకదానిని మరొకటి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కాగా స్థానికులు వారిని చికిత్స నిమిత్తం 108లో నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

బీటీ వేశారు.. సైడ్ బర్మ్స్ మరిచారు

- వాహనచోదకులకు నిత్యం ఇబ్బందులు
- రెండు నెలలు గడిచినా నిర్లక్ష్యం

సంగెం : అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులకు ఇబ్బందులు తెచ్చి పెడుతోంది. నిబంధనల ప్రకారం రోడ్డు పనులు పూర్తి చేయించాల్సి ఉండగా అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని సంగెం నుంచి గవిచర్ల, రామచంద్రాపురం, లోహిత, పెద్దతండా మీదుగా వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లి వరకు 7.4 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు రెన్యువల్ పనుల కోసం ప్రభుత్వం రూ.2.12 కోట్లు మంజూరు చేసింది. పనులు చేపట్టి సుమారు రెండు నెలలు గడచింది. బీటీ రోడ్డు వేసిన వెంటనే సైడ్ బర్మ్ మొరం పోయాల్సి ఉండగా అధికారులు పట్టించుకోకపోడంతో కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా మొరం పోయకుండా వదిలేశారు. దీంతో ఎదురుగా వాహనాలు వచ్చినపుడు ద్విచక్ర వాహనదారులు, ఎడ్లబండ్ల ప్రయాణికులు బీటీ రోడ్ దిగితే మళ్లీ రోడ్డెక్కడం ఇబ్బందిగా మారింది. పలు చోట్ల బీటీ రోడ్డు దెబ్బతింటున్న దుస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం బీటీ రోడ్డు వేయగానే సైడ్‌లకు మొరం పోస్తే వాహనాలు రోడ్డు దిగి, ఎక్కినప్పుడు రోడ్డు దెబ్బ తినకపోయే అవకాశం ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డుకు ఇరువైపులా సైడ్ బర్మ్స్ పోయించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



సైడ్ బర్మ్స్ పోయని సంగెం-ఉప్పరపల్లి రోడ్డు

రోజూ ఇబ్బందులే

బీటీ రోడ్డు వేసినప్పటి నుంచి రోజూ ఇబ్బంది పడుతున్నాం. రెండు నెలలు గడచినా ఇరువైపులా మొరం పోయకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. ఎదురుగా వాహనాలు వస్తే ఎడ్లబండ్లు రోడ్డు దిగి రోడ్డెక్కాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. త్వరగా సైడ్‌లకు మొరం పోయించాలి.

-దానం స్వామి, రైతు

సైడ్ బర్మ్స్ పోయిస్తాం

బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన క్రమంలో రోడ్డు వేసిన వెంటనే సైడ్ బరమ్స్ పోయడం పరిపాటి. సదరు కాంట్రాక్టర్ పోస్తామన్నారు. మొరం అందుబాటులో లేదంటూ జాప్యం చేస్తున్నారు. త్వరలోనే సైడ్ బరమ్స్ పోయించి రైతులకు, వాహనచోదకులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

- అభిరామ్, పీఆర్ ప్రత్యేక ఏఈ

ఉత్సవాలను విజయవంతం చేయండి



పోస్టర్లు, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, తదితరులు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

పర్వతగిరి : మండలంలోని గోపనపల్లిలో నిర్వహించనున్న శ్రీ దూడల మల్లికార్జునస్వామి (మల్లన్న) ఉత్సవాలను విజయవంతం చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కోరారు. కూచన శ్రీనివాస్, కుడికాల సత్యనారాయణ, శ్రీరాములు సహకారంతో ముద్రించిన ఉత్సవాల పోస్టర్లు, స్టిక్కర్లు, క్యాలెండర్లను శుక్రవారం ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు, వెంకట్ రెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగార్జున, ఆలయ కమిటీ చైర్మన్ రాధిక రాజు, కమిటీ సభ్యులు గోపి రాజు, సదయ్య, నాంపల్లి అశోక్, మహబూబ్ పాషా, రాము, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయంలో..

మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో గోపనపల్లి దూడల మల్లికార్జునస్వామి ఉత్సవాల పోస్టర్‌ను తహసీల్దార్ వెంకటస్వామి ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ రాధిక రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' పనుల్లో అక్రమాలు

- డీఆర్‌డీఓ కౌసల్యాదేవి

నెక్కొండ : మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని డీఆర్‌డీఓ కౌసల్యాదేవి తెలిపారు. బాధ్యులపై మొత్తం రూ.87,728 అపరాధ రుసుము విధించినట్టు ఆమె పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాత్రి నిర్వహించిన 15వ విడత సామాజిక తనిఖీ రాత్రి 11 గంటల వరకు కొనసాగిందని తెలిపారు. ప్రజావేదికలో వెలుగు చూసిన అక్రమాలను మీడియాకు డీఆర్‌డీఓ వెల్లడించారు. మస్టర్ల నిర్వహణ, లేబర్ కార్డుల జారీ, పనుల్లో నిర్లక్ష్యం, నిర్వహణలో లోపాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఈ క్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.20 వేల 221, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.4 వేల 120, ఏపీఓకు రూ.3 వేలు, గ్రామ కార్యదర్శులకు రూ.5 వేల 90, ఇతరులకు (మేట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, జేఈ) రూ.54,838 అపరాధ రుసుము విధించామని వివరించారు. విధుల్లో నిర్లక్ష్యం చేసినా, అక్రమాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

నర్సంపేట రూరల్ : కమ్మపల్లి స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



వర్ధన్నపేట : ల్యాబర్తి స్కూల్ ఆవరణలో...



చెన్నారావుపేటలో..



ముందస్తు సంక్రాంతి సంబురాలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, పర్వతగిరి, దుగ్గొండి, రాయపర్తి, సంగెం, చెన్నారావుపేట మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు రంగులు, గొబ్బెమ్మలతో ముగ్గులు అలంకరించారు. ఆటపాటలతో సందడి చేశారు. హరిదాసులు, రైతుల వేషధారణలో అలరించారు. గాలి పటాలు ఎగురవేశారు. పలు స్కూళ్లలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



దుగ్గొండి : ప్రభుత్వ హైస్కూల్‌లో..



రాయపర్తి : లహరి పబ్లిక్ స్కూల్‌లో..



పర్వతగిరి : ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



సంగెం : జూనియర్ కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

వివేకానందుడి జీవితం యువతకు ఆదర్శం



నర్సంపేట రూరల్ : మాట్లాడుతున్న రాజ్‌కుమార్

- ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ రాజ్‌కుమార్

నర్సంపేట రూరల్ : స్వామి వివేకానందుడి జీవితం యువతకు ఆదర్శమని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజ్‌కుమార్ తెలిపారు. ఆ సంఘం ఆధ్వర్యంలో నర్సంపేట మండలంలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్, బిట్స్ ఏఓ సురేశ్ ప్రసంగించారు. స్వామి వివేకానంద ప్రపంచ దేశాలకు సంస్కృతిని చాటి చెప్పారని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్, నగర కార్యదర్శి రాకం రాకేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిప్పారపు గణేశ్, నెక్కొండ జాయింట్ సెక్రటరీ దాసరి గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్‌లో..

పర్వతగిరి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో హైదరాబాద్‌కు చెందిన స్వామి రంగనాథానంద ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మిడ్‌టౌన్ సహకారంతో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు 'భారతజాతికి నా హితవు' పుస్తకంపై స్థానిక శ్రీరామకృష్ణ సేవా సమితి బాధ్యులు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఒక్కో స్కూల్ నుంచి ఐదుగురికి పరీక్షలు నిర్వహించగా 47 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలను ఎంపిక చేసి ఈనెల 26న బహుమతులు అందజేస్తామని జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు పాక రమేశ్ తెలిపారు. అనంతరం విద్యార్థులకు వివేకానంద సాహిత్యం, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో స్టూడెంట్ కోఆర్డినేటర్ మడత భాస్కర్, సేవా సమితి బాధ్యులు చింతపట్ల సురేందర్‌రావు, చిదురాల వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలపై అవగాహన కీలకం

- సెంటర్ ప్రతినిధి (అడ్మిన్) శ్రీలత

గీసుకొండ : సఖి కేంద్రం ద్వారా బాధిత మహిళలకు అందుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడం కీలకమని సఖి కేంద్రం ప్రతినిధి (అడ్మిన్) వల్లె శ్రీలత తెలిపారు. మండలంలోని గంగదేవిపల్లిలో మహిళా కమిటీ సభ్యులకు శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళా కమిటీ సభ్యులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామాల్లో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలత

ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు హెల్ప్‌లైన్ నంబర్ 181కు ఫోన్ చేసి రక్షణ పొందాలని చెప్పారు. కార్యక్రమంలో సర్వోదయ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్, కోఆర్డినేటర్ ఇందిర, ఫీల్డ్ కోఆర్డినేటర్ అక్తర్, కేస్ వర్కర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కులగణన ప్రకారమే రిజర్వేషన్లు కల్పించాలి

- జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామి

నల్లబెల్లి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కామారెడ్డి డిక్లరేషన్ మేరకు 42 శాతం కాకుండా ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన బీసీ కులగణన ప్రకారమే రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాలులో చీకటి ప్రకాశ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కుమారస్వామి మాట్లాడారు. రాబోయే రోజుల్లో చట్టసభల్లోనే కాకుండా విద్య, ఉద్యోగ రంగాలతోపాటు బడ్జెట్‌లో బీసీలకు సముచిత వాటా ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం సమితి మండల అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా రంగాపురం గ్రామానికి చెందిన చీకటి ప్రకాశ్, కోకన్వీనర్లుగా పాండవుల రాంబాబు, వైనాల వీరస్వామి, బోగ భద్రయ్య, ఓదెల రవి, కడియాల మనోహర్, మామిండ్ల మోహన్‌రెడ్డి, కొనుకటి వీరమల్లు, సురబోయిన రాంబాబు, ముత్తినేని అశోక్, మేడిపల్లి రాజు, వక్కల తిరుపతితోపాటు సభ్యులను నియమించారు. సమావేశంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గోవర్ధనచారి, తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

పరీక్ష ప్యాడ్ల అందజేత

వర్ధన్నపేట : మండలంలోని దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాలలో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ థౌజెండ్ పిల్లర్స్ హన్మకొండ జీఎస్టీ కోఆర్డినేటర్ రేవూరి రమణారెడ్డి శుక్రవారం సొంత ఖర్చుతో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపగవర్నర్ నరహరి సుధాకర్‌రెడ్డి, అధ్యక్షుడు చొప్పరి సోమయ్య, స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం సంపత్‌కుమార్, ఉపాధ్యాయులు వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని కొసవాడలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒకటో, రెండో వార్డుల్లో రెండు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయి కొసవాడలోని వీధిలైట్లు కాలిపోగా ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని చెప్పారు. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రివేళ బయటకు రావాలంటే పిల్లలు, వృద్ధులు భయపడుతున్నారని తెలిపారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి ప్రాధాన్యం

నర్సంపేట : ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి సంఘం ప్రాధాన్యత ఇస్తుందని గౌరవ అధ్యక్షుడు గట్ల అమరేందర్ తెలిపారు. పట్టణంలోని ఐఎంఏ హాలులో సంఘం మండల అధ్యక్షుడు దుర్గేశ్ ఆధ్వ శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఫొటో కెమెరా పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరేందర్ మాట్లాడారు. ఫొటో, వీడియోగ్రాఫర్లు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. నికాన్ కంపెనీ బాధ్యులు టెక్నాలజీ ట్రేడింగ్ కెమెరాల గురించి వివరిస్తూ సందేహాలు నివృత్తి చేశారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న వెంకటేశ్ తల్లి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం రూ.5 వేల సాయం అందజేశారు. తొలుత వెంకటేశ్‌ను పరామర్శించి ఓదార్చారు.

విద్యార్థుల ఫొటోలతో క్యాలెండర్లు అభినందనీయం

నల్లబెల్లి : ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఫొటోలతో నూతన సంవత్సర క్యాలెండర్లు ముద్రించడం అభినందనీయమని ఎంపీడీఓ నర్సింహమూర్తి అన్నారు. మండలంలోని నాగరాజుపల్లి శివారులోని పంతులుపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన సంవత్సర క్యాలెండర్లను ప్రధానోపాధ్యాయుడు కర్ణకంటి రామ్మూర్తితో కలిసి ఎంపీడీఓ నర్సింహమూర్తి శుక్రవారం ఆవిష్కరించారు. ఇటీవల ఉపాధ్యాయుడిగా నియమితుడైన రాజన్ బాబు సొంత ఖర్చుతో క్యాలెండర్లు పంపిణీ చేయడంతో ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ వసంత, మాజీ సర్పంచ్‌లు గోనె శ్రీదేవి, ఆసం చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



అశోక్ (ఫైల్)

ఖానాపురం : ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మనుబోతులగడ్డలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అమ్మ అశోక్ (45)కు పంటల సాగు, కుటుంబ పోషణ కోసం రూ.5.50 లక్షల అప్పు చేశాడు. పంటల దిగుబడి తక్కువగా రావడంతో మద్యానికి బానిసయ్యాడు. అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై వ్యవసాయ భూమి వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటేశ్వర్లపల్లిలో..



వెంకటేశ్ (ఫైల్)

రాయపర్తి : మండలంలోని వెంకటేశ్వర్లపల్లికి చెందిన గూబ వెంకటేశ్ (30) గురువారం రాత్రి గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

నర్సంపేట రూరల్ : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నాలుగు సార్లు స్థానం సంపాదించిన ప్రముఖ రచయిత, పర్యావరణవేత్త డాక్టర్ పెండెం కృష్ణకుమార్ ఆకాంక్షించారు. నర్సంపేట పట్టణంలోని మూడుచెక్కలపల్లి ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు శుక్రవారం ఆయన అనేక దేశాల నాయకుల, శాస్త్రవేత్తల చిత్రపటాలు, మెడికల్ కిట్, వాటర క్యాన్, వరల్డ్, ఇండియా, తెలంగాణ మ్యాప్స్, గోడ గడియరాలు, ఆట వస్తువులు, క్లాత్ బ్యాగ్‌లు అందించి మాట్లాడారు. విద్యార్థులు పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాన్ని వివరించారు. మొక్కలు నాటడంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు బేబి, జ్యోతి, కవిత, సునీత, ఇందిర, నాన్ టీచింగ్ సిబ్బంది చరిత, అంజమ్మ, నవీన, తులసి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో మహిళల అభివృద్ధి

- మాతృభూమి ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు

నర్సంపేట : స్వయం ఉపాధితో మహిళలు అభివృద్ధి చెందాలని మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మోహన్‌రావు ఆకాంక్షించారు. పట్టణంలో ప్రతిభ, ఎఫ్ఎంఎం స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మగ్గం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుక్రవారం ఆయన ధృవీకరణ పత్రాలు అందజేసి కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నైపుణ్య శిక్షణ ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించడంతోపాటు ఇతర నిరుద్యోగులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి మాట్లాడుతూ పేద మహిళలకు ఉచితంగా మగ్గం వర్క్‌లో నైపుణ్యాన్ని అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ సంస్థ అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ పేద మహిళల్లో నైపుణ్యాన్ని వెలికితీసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, జిల్లా వినియోగదారుల విజిలెన్స్ కమిటీ సభ్యుడు నాగెల్లి సారంగం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, మగ్గం శిక్షకురాలు నాడెం లక్ష్మి, ఎఫ్ఎంఎం సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, మేనేజర్ అజయ్‌కుమార్, అమర్, తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న మోహన్‌రావు

హిందీ నేర్చుకుంటే ఉజ్వల భవిష్యత్



సంగెం : మాట్లాడుతున్న మేనేజర్ అనిల్

- యూనియన్ బ్యాంకు మేనేజర్ అనిల్

సంగెం : హిందీ నేర్చుకుంటే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్థానిక యూనియన్ బ్యాంకు సీనియర్ మేనేజర్ యాకర అనిల్ తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో ప్రపంచ హిందీ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. అనంతరం మేనేజర్ అనిల్ మాట్లాడారు. హిందీ నేర్చుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఓ నీలిమ, బ్యాంకు ఆఫీసర్ రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ టెక్నో స్కూల్‌లో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో అంతర్జాతీయ హిందీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ హాజరై ప్రారంభించారు. విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన హిందీ సంబంధిత చార్ట్‌లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రియాజొద్దీన్, తబస్సుమ్, అఫ్రీన్, నర్సింహస్వామి, విష్ణులత, బాలకిషన్, లలిత, తదితరులు పాల్గొన్నారు.